## క్లుప్తంగా

### వృద్ధులకు టవళ్ల పంపిణీ



వృద్ధాశ్రమంలో టవళ్లు పంపిణీ చేస్తున్న అబ్దుల్ సత్తార్

**ఒంగోలు సెంట్రల్:** అబ్దుల్ సత్తార్ సోషియల్ డెమోక్రటిక్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక బలరాంకాలనీలోని ఉషోదయ వృద్ధాశ్రమంలో వృద్ధులకు శుక్రవారం టవళ్ల పంపిణీ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్, ఆశ్రమ నిర్వాహకురాలు కోటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### కొత్తపట్నం ఫంక్షనల్ కమిటీల సమావేశాలు వాయిదా

**ఒంగోలు:** కొత్తపట్నం మండల ఫంక్షనల్ కమిటీల సమావేశాలను వాయిదా వేస్తున్నట్లు కొత్తపట్నం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్‌వీ ఫణికుమార్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో అసెంబ్లీ సమావేశాలు, 23న జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఉన్నందున ఈ నెల 22న జరగాల్సిన కొత్తపట్నం మండల పరిషత్ ఫంక్షనల్ కమిటీల సమావేశాలను వాయిదా వేస్తున్నట్లు వివరించారు.

### వైభవంగా చండీ మహాయాగం



చండీ మహాయాగంలో పాల్గొన్న భక్తులు

**తాళ్లూరు (ముండ్లమూరు):** జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ గుంటిగంగా భవాని అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం చండీ మహాయాగం వైభవంగా నిర్వహించారు. చండీ మాత సకల దేవతా స్వరూపిణి, ఆమె అమ్మలగన్న అమ్మ, సృష్టి చక్రానికి కారణమయ్యే బ్రహ్మిగా సుఖ సంపదలతో చల్లగా కాపాడే వైష్ణవిగా సకల సౌభాగ్య మంగళాలను ప్రసాదించే తాంకరిగా, జగజ్జనని వేదాని వాఙ్మయంలో స్తుతింపబడింది. ఆ చల్లని తల్లిని ప్రసన్నం చేసుకొని సకల జనపదాలకు దేశానికి, ప్రజలకు మంచి జరిగి ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్య భాగ్యాలను ఆకాంక్షిస్తూ తలపెట్టిన పవిత్ర కార్యమే ఆయుత చండీ మహాయాగమని వేద పండితులు కొనియాడారు. చండీ మహాయాగం కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. హోమం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. ఆలయ పూజారులు కామేశ్వరశర్మ, ప్రసాదరావు, బాలరాజులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఈఓ కార్తీక్ భక్తులకు అన్ని వసతులు కల్పించారు. తాళ్లూరు ఎస్ఐ విజయకుమార్ ప్రత్యేక పూజలు చేశారు.



సాయిబాబా సెంట్రల్ స్కూల్లో యోగా చేస్తున్న విద్యార్థులు



ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులతో కలిసి యోగా చేస్తున్న ప్రిన్సిపాల్ కళ్యాణి



యోగా దినోత్సవాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

# ఆరోగ్య వరప్రదాయిని.. యోగా

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి
- పలుచోట్ల ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**ఒంగోలు:**

యోగా అనేది సంస్కృతి ప్రసాదించిన ఆరోగ్య వరప్రదాయిని అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఒంగోలు నగరంలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా జిల్లా న్యాయ స్థానం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ మన ఆరోగ్యం మెరుగుపరుచుకోవడం కోసం ప్రతిఒక్కరూ రోజుకు ఒక అరగంటైనా యోగా చేయాలన్నారు. దీనివల్ల మానసికంగా ఎంతో ప్రశాంతంగా ఉంటుందని, చేసే పనిలో కూడా ఏకాగ్రత కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు డి.అమ్మనరాజా, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ నరసింహరాజు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు, సీనియర్ న్యాయమూర్తులు, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, జిల్లా ప్రధాన న్యాయస్థానం ప్రధాన అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

**క్విస్ కాలేజీలో...**

స్థానిక క్విస్ కాలేజీలో క్విస్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి అధ్యక్షతన ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, క్రీడా విభాగాలు సంయుక్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించాయి. అధ్యాపక సిబ్బంది, విద్యార్థులచే యోగా శిక్షకురాలు టీపీ ప్రసన్న ఆసనాలు చేయించారు. ఈ సందర్భంగా క్విస్ అధినేత నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం యోగా చేయడం వల్ల మంచి ఆరోగ్యం, శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఆరోగ్య సమస్యలకు గురవకుండా ఉంటారన్నారు. విద్యార్థి దశ నుంచే యోగా చేయడం ద్వారా భవిష్యత్తులో ఎటువంటి ఆరోగ్య సమస్యలు దరిచేరవని సూచించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులను కాలేజీ వైస్ చైర్మన్ డాక్టర్ ఎస్.గాయత్రిదేవి, ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు అభినందించారు.



సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద...



ట్రిపుల్ ఐటీలో యోగా విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

**ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో...**

స్థానిక దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి యోగా ఆవశ్యకతను వివరించారు. యోగా సాధకుడు టింకాయల శ్రీనివాసులు యోగా నిర్వచనాన్ని, ప్రయోజనాలను వివరించి శ్వాస సంబంధమైన వ్యాయామాలను, సూర్య నమస్కారాలను విద్యార్థులచే చేయించారు. వ్యాయామ అధ్యాపకులైన డాక్టర్ డి.ధనుంజయరావు మాట్లాడుతూ మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండటం కోసం యోగా చాలా ఉపయోగపడుతుందన్నారు.

**సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద...**

స్థానిక మామిడిపాలెం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి వడ్డెంపూడి సుజాత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా వల్ల మానసిక దృఢత్వం పెరుగుతుందని, అనారోగ్య సమస్యలు రావని అన్నారు. వి.శ్రీరామమూర్తి మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా చేయడం వల్ల శారీరక శక్తితో పాటు మానసిక శక్తి పెరుగుతుందన్నారు. రోజూ వ్యాయామం చేయడం వల్ల దినచర్యను ఉత్సాహవంతంగా పూర్తి చేయగలరన్నారు. ఈ సందర్భంగా అందరికీ పండ్లు, మొలకెత్తిన విత్తనాలు, డ్రైఫ్రూట్స్ అల్పాహారంగా అందించారు. కార్యక్రమంలో యోగా కమిటీ సభ్యులు వెంకటరెడ్డి, కొండయ్య, సంజీవరావు, కుమార్, వినోద్, జగన్‌మోహన్‌రెడ్డి, రామిరెడ్డి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

**సాయిబాబా సెంట్రల్ స్కూల్లో...**

స్థానిక సాయిబాబా సెంట్రల్ స్కూల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పద్మాసనం, ధనురాసనం, వజ్రాసనం, హలాసనం, భుజంగాసనం, సూర్య నమస్కారాలు చేశారు. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సాయినాథుని శృతి మాట్లాడుతూ శరీరాన్ని, మనసును ఆరోగ్యంగా ఉంచుకోవడానికి యోగా చాలా ముఖ్యమని, క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తే శరీరాన్ని బలంగా ఉంచడమే కాకుండా చాలా సమస్యలకు దూరంగా ఉండవచ్చని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ జీవీ భాస్కర్, ప్రిన్సిపాల్ ఎం.మహేష్, శైలక్ష్మి యోగా ద్వారా విద్యార్థులు ఆరోగ్యకరమైన, ఆనందకరమైన జీవితాన్ని అనుభవించవచ్చని అన్నారు.

**ట్రిపుల్ ఐటీలో...**

స్థానిక ట్రిపుల్ ఐటీ క్యాంపస్ 3లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ భాస్కర్ పటేల్ మాట్లాడుతూ యోగా విద్య విద్యార్థి జీవితానికి కావాల్సిన ఏకాగ్రత, జ్ఞాపక శక్తి, సంపూర్ణ ఆరోగ్యానికి ఒక వజ్రాయుధంలా పనిచేస్తుందన్నారు. ప్రతిరోజూ యోగా చేయడం వల్ల ఒత్తిడిని అధిగమించి ప్రశాంతంగా జీవించవచ్చన్నారు. యోగా శిక్షకుడు పగడాల చంద్రశేఖర్ మాట్లాడుతూ యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానాన్ని చేయించి యోగా విద్య ప్రాముఖ్యతపై సంపూర్ణ అవగాహన కలిగించారు. సమావేశంలో విద్యార్థులు వేసిన ఆసనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఏవో చంద్రశేఖర్, ఎఫ్ఓ డాక్టర్ ఎస్కే మీరావలి, డీన్ ఆఫ్ అకడమిక్స్ రూపేష్ కుమార్, ఎస్‌డబ్ల్యూఓ డీన్ డాక్టర్ సురేష్‌బాబు, పీడీ పీవీ భాస్కర్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



క్విస్ కాలేజీలో...

# అమ్మవారికి పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

**ఒంగోలు మెట్రో:** క్రోధి నామ సంవత్సరం జేష్ఠ మాసం శుక్రవారం పౌర్ణమి సందర్భంగా నగరంలోని అమ్మవారి దేవాలయాల్లో అభిషేకాలు, కుంకుమ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక గంటాపాలెంలోని పార్వతీ అమ్మవారికి, బాలాజీరావుపేటలో శ్రీ కనకదుర్గమ్మకు, కేశవస్వామిపేటలోని విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో, లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి, కేశవస్వామిపేటలోని లలితా ఆశ్రమంలో లలితా అమ్మవారికి, గద్దలగుంటలో మహాకాళి మహాలక్ష్మి, మహా సరస్వతి అమ్మవార్లకు, చెన్నకేశవస్వామి దేవస్థానంలోని రాజ్యలక్ష్మి అమ్మవారికి, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో నాగలక్ష్మి అమ్మవారికి, సమతానగర్ కాలువ దగ్గర వెలసిన కనకదుర్గమ్మకు, మంగమూరు రోడ్డు గాయత్రి మందిరంలో పంచముఖ గాయత్రి అమ్మవారికి, రంగారాయుడు చెరువు దగ్గర కంచి కామాక్షమ్మ దేవస్థానంలో, కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోం దగ్గర మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో, ఏనుగు చెట్టు దగ్గర కాళికా కళారానికి, కొత్తపట్నం బస్టాండ్ దగ్గర ఉన్న బాలా త్రిపుర సుందరీదేవి కళారానికి, కమ్మపాలెంలోని కాళికా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్లకు శ్రీ సూక్తంతో పాలు, పెరుగు, తేనె, చెక్కెర, పండ్ల రసాలతో అభిషేకం చేశారు. వివిధ రకాల పూలతో చక్కగా అలంకరణ గావించారు. శ్రీ చక్రానికి దేవి ఖడ్గమాలతో అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించి మంగళ హారతులతో భక్తులకు దివ్యదర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమాలలో దేవస్థానాల పాలకవర్గం, స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బడికి పోదాంను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ బాలచెన్నయ్య

**కొత్తపట్నం (ఒంగోలు సెంట్రల్):** కొత్తపట్నం మండలస్థాయి అధికారులంతా సమష్టిగా కృషి చేసి బడికి పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని ఈఓపీఆర్డీ బాలచెన్నయ్య కోరారు. కొత్తపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బడికి పోదాం కార్యక్రమంపై మండల స్థాయి అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈఓపీఆర్డీ బాల చెన్నయ్య మాట్లాడుతూ ప్రతి అధికారి తమ శాఖల పరిధిలోని క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని కోరారు. మండల విద్యాశాఖాధికారి తులసీకుమారి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బడి ఈడు పిల్లలను గుర్తించి తప్పనిసరిగా విద్య అందించే విధంగా తల్లిదండ్రులను ప్రోత్సహించాలని చెప్పారు. ఎంఈఓ–2 పద్మావతి మాట్లాడుతూ డ్రాపవుట్ పిల్లలు ఉండకుండా ప్రతిఒక్కరూ బడిలో ఉండేలా సర్వే చేసి గుర్తించాలని కోరారు. జూలై 12 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, ప్రతి గ్రామంలో సర్వే నిర్వహించి ఆరు నుంచి 14 సంవత్సరాల్లోపు విద్యార్థులందరినీ పాఠశాలలో చేర్పించాలని కోరారు. అల్లూరి పాఠశాల హెచ్ఎం సుబ్బారావు మాట్లాడుతూ విద్య ప్రాముఖ్యతను వివరించి ప్రతి విద్యార్థి చదువు కొనసాగించేలా చూడాలని కోరారు. వ్యవసాయాధికారి నరేంద్ర దేవ్, ఏపీఎం షేక్ సుల్తాన్ రజియాబేగం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణకుమారి, గ్రామకార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, సీఆర్‌ఎంటీలు, ఐఈఆర్‌పీలు, ఇన్‌స్ట్రక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

**బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి**

**మద్దిపాడు:** చదువుకోకుండా బయట తిరుగుతున్న పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీఓ శ్రీహరి ఆదేశించారు. శుక్రవారం వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు, క్రాంతి పథం సీసీలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా బడి ఈడు పిల్లలు పనికిపోకుండా చూడాలని, వారిని తిరిగి పాఠశాలకు పంపే విధంగా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలల్లో ఎన్‌రోల్ పెరిగే విధంగా గ్రామాల్లో సర్పంచ్, కార్యదర్శి, ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు, వీఓఏలను కలుపుకుని టీంగా ఏర్పడి నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీలు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆశాజ్యోతి, ఎంఈఓలు ఎంవీఆర్ ఆంజనేయులు, ఎం.శ్రీనివాసరావు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షపై న్యాయ విచారణ జరపాలి

- కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలి
- విద్యాశాఖామంత్రి రాజీనామా చేయాలి
- బీజేపీ, మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల కేంద్రంగానే నీట్ స్కాం
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన, మానవహారం




నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థులు

**ఒంగోలు సెంట్రల్:** దేశవ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో పెద్ద ఎత్తున అక్రమాలు, అవకతవకలు జరగడంపై విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలు సాయిబాబా గుడి సెంటర్ వద్ద మానవహారం నిర్వహించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ మాట్లాడుతూ నీట్ పరీక్షపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తగా, కేంద్రంలో మోదీ ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటానికి నిర్ణయించుకుందని అన్నారు. కొన్ని రోజులుగా నీట్ స్కాంపై అభ్యర్థులు గగ్గోలు పెట్టడంతో పాటు న్యాయ స్థానాలను ఆశ్రయించినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. చివరికి సుప్రీం కోర్టు కేంద్రానికి, నీట్‌ను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)లకు నోటీసులు జారీ చేశాక ఎట్టకేలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మాన్ ప్రధాన్ స్పందించి రెండు చోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించామని అంగీకరించారన్నారు. ఎన్‌టీఏను మెరుగుపర్చాల్సి ఉందని చెప్పుకొచ్చారని, అంతే తప్ప కుంభకోణంపై విచారణ జరిపిస్తామనిగానీ, అభ్యర్థులకు ఏ విధమైన న్యాయం చేస్తామనిగానీ తెలపకపోవటం విచారకరమని అన్నారు. అవేవో సాధారణంగా చోటుచేసుకున్న చిన్న తప్పులు అన్నట్లు మంత్రి పేర్కొన్నారని, అంతే తప్ప కించిత్తు పశ్చాత్తాపం వ్యక్తీకరించలేదని ఆరోపించారు. నీట్‌లో అవకతవకలే జరగలేదని కేంద్రం చెబుతూ వచ్చిందని, బీజేపీ కేంద్ర పాలిత రాష్ట్రం గుజరాత్‌లో అవకతవకలు జరిగాయని పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో ఒక్కసారిగా అక్రమాల పుట్ట పగిలినట్లయిందని అన్నారు. ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు, ఉపాధ్యాయులపై కేసులు నమోదు చేశారని, ఐదుగురు వ్యక్తులను కూడా అరెస్ట్ చేశారని అన్నారు. మరోవైపు ఎన్‌డీఏ పాలనలో బీహార్‌లో ప్రత్యేకంగా సిట్ వేసి దర్యాప్తు చేస్తున్నారని, ఇప్పటికే 13 మందిని అరెస్ట్ చేశారని అన్నారు. వారిలో మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వారు ఉన్నారని చెప్పారు. దీనిని బట్టి చూస్తుంటే బీజేపీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల కేంద్రంగా నీట్‌స్కాం విస్తరించినట్లు ఉందని ఆరోపించారు. గతంలో మధ్యప్రదేశ్‌లో శివరాజ్ సింగ్ ప్రభుత్వంలో ఉద్యోగాల నియామకాల్లో జరిగిన వ్యాపం కుంభకోణం గుర్తుకొస్తుందన్నారు. కాగా, కోర్టు విచారణ సందర్భంగా వెల్లడవుతున్న నీట్ అక్రమాలు అందరినీ నివ్వెరపరుస్తున్నాయని చెప్పారు. 67 మంది అభ్యర్థులకు 720 మార్కులొచ్చాయని, వారిలో హర్యానాకు చెందిన ఒకే పరీక్ష కేంద్రానికి సంబంధించిన ఆరుగురు ఉన్నారని అన్నారు. ఓఎంఆర్ షీట్లలో ఒకవిధంగా, స్కోరింగ్ కార్డులలో మరో విధమైన మార్కులు వచ్చాయని చెప్పారు. అనూహ్యమైన రీతిలో కటాఫ్ మార్కులు, సగటు మార్కులు పెరిగాయన్నారు. ఈ అక్రమాలు మచ్చుకు మాత్రమే అని, నిష్పక్షపాతంగా సమగ్ర దర్యాప్తు జరిపిస్తే మరెన్నో అక్రమాలు వెలుగుచూడవచ్చని అన్నారు. తక్షణమే నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై న్యాయవిచారణ జరిపి అన్ని రాష్ట్రాల హక్కులు స్వయం ప్రతిపత్తిని కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి బండి వీరాస్వామి, ఆనంద్, అఖిల్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కుమారగిరి ప్రదక్షిణ



త్రిపురాంతకంలో గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

**త్రిపురాంతకం:** శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయం వద్ద పౌర్ణమి సందర్భంగా కుమారగిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. త్రిపురాంతకం కుమారగిరి వద్ద ప్రతి పౌర్ణమికి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని భక్తులు నిర్వహిస్తారు. ప్రదక్షిణ అనంతరం శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు విశ్వనారాయణశాస్త్రి భక్తులచే పూజలు జరిపించారు.

### గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**నాగులుప్పలపాడు:** గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి పది గంటల సమయంలో నాగులుప్పలపాడు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వేటపాలెం మండలం రావూరు గ్రామానికి చెందిన ఎండ్లూరి ఎలీశా(45) ఉప్పుగుండూరు నుంచి ఒంగోలుకు తన మోటరుసైకిల్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో నాగులుప్పలపాడులోని రైతుబంధు కోల్డ్ స్టోరేజ్ సమీపంలో 216 జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఎలీశా అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో మృతి చెందిన ఎలీశా

### అనాథను అక్కున చేర్చుకున్న వృద్ధాశ్రమం



వృద్ధుడు కోటేశ్వరరావుతో కాశయ్య

**కురిచేడు:** అనాథ వృద్ధుడిని శ్రీకరుణా వృద్ధాశ్రమం నిర్వాహకుడు మోతుకూరి కాశయ్య అక్కున చేర్చుకుని తన ఆశ్రమానికి తీసుకొచ్చి ఆశ్రయమిచ్చాడు. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. వివరాలు.. నరసరావుపేట లింగంగుంట కాలనీలోని శివ హోటల్ వద్ద ఓ వృద్ధుడు నిస్సహాయ స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన ఆ ప్రాంతవాసులు ఆశ్రమ నిరవహకుడు కాశయ్యకు సమాచారం అందించారు. వెంటనే నరసరావుపేట వెళ్లి ఆ వృద్ధుడిని శుభ్రం చేసి బట్టలు వేయించి ఆశ్రమానికి తీసుకొచ్చాడు. ఎవరు ఇలాంటి వారి గురించి తెలిపినా వెంటనే వెళ్లి వారిని ఆశ్రమానికి చేర్చి సేవచేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు కాశయ్య.

## ఉపాధి పనులు ప్రారంభిస్తారా.. నిరుద్యోగ భృతి ఇస్తారా..?

- వ్యవసాయ కార్మిక సంఘ నాయకుల డిమాండ్



డ్వామా పీడీకి వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

**ఒంగోలు టౌన్:** ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి నిలిచిపోయిన ఉపాధి హామీ పనులను వెంటనే ప్రారంభించాలని, లేకపోతే ఉపాధి హామీ చట్టం ప్రకారం నిరుద్యోగ భృతి కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో డ్వామా పీడీ బి.అర్జునరావును కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ప్రకారం వేతనదారులు పని కోరిన కాలంలో పని కల్పించాల్సి ఉంటుందని, పని కల్పించలేకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. 4వ తేదీ నుంచి నేటి వరకు జిల్లాలో ఉపాధి హామీ పనులు ఆగిపోయాయని, వ్యవసాయ పనులు పూర్తిగా లేని కాలంలో గ్రామీణ ప్రాంత ప్రజలు ఉపాధి హామీ పనుల మీదే ఆధారపడతారని తెలిపారు. ప్రతి సంవత్సరం ఈ నెలలో 2 లక్షల నుంచి 3 లక్షల మంది వరకు గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో ఉండేవారన్నారు. వెంటనే జిల్లా అధికారులు చొరవ చూపాలని కోరారు. అలాగే గత ఆరువారాలుగా చేసిన పనికి వేతనాలు విడుదల కాలేదని, రెక్కల కష్టం మీద ఆధారపడి బతికే ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. సమ్మర్ అలవెన్స్‌ను కొనసాగించాలని, ప్రతి గ్రూపునకు టెంట్, మెడికల్ కిట్ ఇవ్వాలని, పాత పద్ధతిలోనే మజ్జిగ, మంచి నీళ్లు, పనిముట్లు అందించాలని కోరారు. వేతనదార్లు పని ప్రదేశంలో మరణిస్తే రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, ప్రతి కుటుంబానికి 200 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు.